

శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైన వెల్దుర్తిలోని విఠలేశ్వర ఆలయం

## రాములోరి కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

మెదక్ మున్సిపాలిటీ/వెల్దుర్తి, ఏప్రిల్ 5: సీతారాముల కల్యాణోత్సవానికి జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయం, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు ఆలయాలకు రంగులు వేసి, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు హోమం, 11 గంటలకు స్వామి వారి ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12 గంటలకు సీతారామ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం చేస్తారు.



మెదక్‌లో ముస్తాబైన కోదండ రామాలయం

## వేంకటేశ్వర ఆలయంలో ధ్వజ స్తంభ పూజ



పాపన్నపేట, ఏప్రిల్ 5: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రారంభ పూజ చేశారు. వేద బ్రాహ్మణులు అర్చన, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పోతేదార్ మల్లన్న, గజవాడ రాజశేఖర్ దంపతులు పాల్గొన్నారు. ఆదివారం సీతారాముల కల్యాణం, సోమవారం ధ్వజ స్తంభ ఆరోహణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మనోహరాబాద్, ఏప్రిల్ 5: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన నూకల రాములు యాదవ్, మల్లేశ్ యాదవ్‌లకు మంజూరైన రూ.83 వేల రెండు చెక్కులను బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో రాము యాదవ్, సత్యనారాయణ గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

రామాయంపేట, ఏప్రిల్ 5: ప్రమాదవశాత్తు పశువులకు చెరువులో నీరు తాగిస్తుండగా కాలు జారి అందులోనే పడి మహిళ మృతి చెందిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాండు చెరువులో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురపాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన చిన్నవాల్ల లక్ష్మి(55) ఎప్పటిలాగే పశువులకు నీరు తాగించడం కోసం దగ్గరలో ఉన్న పాండు చెరువులోకి తీసుకెళ్లింది. పశువులు చెరువు లోపలకు వెళ్లడంతో వాటిని పైకి తీసుకురావడం కోసం చెరువులోకి దిగింది. కాలు జారడంతో చెరువులోనే పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మహిళ కుటుంబీకులు చెరువు వద్దకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో మహిళ మృతదేహాన్ని పైకి తీసుకొచ్చారు. మృతదేహాన్ని పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మహిళ మృతదేహం

## గిరిజన తండాలో భోగ్‌భండార్

రామాయంపేట, ఏప్రిల్ 5: మున్సిపల్ పరిధిలోని గిరిజన తండాల్లోని సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద భోగ్‌భండార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తండాల్లోని సేవాలాల్ మహరాజ్ గుడిలో స్వామికి పూజలు చేశారు. తండాలోని భక్తుల ఇండ్లలో స్వామికి నైవేద్యం తయారు చేశారు. అనంతరం మాలధారులు భిక్షగా నైవేద్యం స్వీట్లు స్వీకరించారు.



## చండూర్‌లో బీరప్ప జాతర ప్రారంభం



చిలిపిచెడ్, ఏప్రిల్ 5: మండలంలోని చండూర్‌లో గొల్లకుర్మ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో బీరప్ప జాతర ప్రారంభించారు. శనివారం గొల్లకుర్మలు గంగ బోనం సమర్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పోతరాజుల విన్యాసాలతో ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం బీరప్ప, కామరాతి దేవతలకు బోనాల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు భారీగా రావాలని వారు కోరారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొల్చారం, ఏప్రిల్ 5: నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీళ్లు పడుతూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. వరిగొంతం గ్రామానికి చెందిన బాలయ్య వాండ్ల పోచయ్య(39) తండ్రి కీ.శే. నారాయణ శనివారం ఇదే గ్రామంలో తాము నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీళ్లు పడుతానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అరగంట తర్వాత బాధితుడి కుమారుడు నరేందర్ కొత్త ఇంటికి వెళ్లి చూడగా ఇంటి పక్కన రోడ్డుపై ఉన్న కరెంటు వైరు పోచయ్య ఎడమ చెయ్యి అరచేతికి తాకింది. విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాధితున్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి అప్పటికే మరణించాడని తెలిపారు. మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోచయ్య మృతదేహం

# జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



నర్సాపూర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు



మెదక్ మున్సిపాలిటీ: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలో జిల్లా అధ్యక్షుడు నరేందర్

- జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి జగ్జీవన్ రామ్
- కలెక్టర్ రాహుల్ రాజ్

బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కొనియాడారు. శనివారం నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువతకు బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకం కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్‌కం బోర్డు ఆవరణలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబూ జగ్జీవన్ రాం జయంతిని వివిధ దళిత సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ పూలమాలలతో నివాళులర్పించారు. అణగారిన వర్గాల ఆత్మబంధువు జగ్జీవన్ రామ్ అని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, ఏప్రిల్ 5



చిన్నశంకరంపేట జగ్జీవన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు





రామాయంపేటలో దళిత బహుజన సంఘాల అధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతి



తూప్రాన్: జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్



చేగుంటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి నివాళి

# కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుంటా



నర్సాపూర్‌లో పుట్టిన రోజు సందర్భంగా కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



వెల్దుర్తిలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కౌడిపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

- కేసీఆర్ నాయకత్వంలో పనిచేద్దాం
- రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు
- భారీగా హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

నర్సాపూర్, ఏప్రిల్ 5: కష్టసుఖాల్లో, మంచి చెడులో ఎల్లప్పుడు బీఆర్ఎస్ కార్యకర్తలకు తోడుంటానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. శనివారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె పుట్టిన రోజు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మల్లన్న ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. వేడుకకు తరలివచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని, ఆయన నాయకత్వంలో పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారన్నారు.

### శివ్వంపేటలో

శివ్వంపేట, ఏప్రిల్ 5: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. శివ్వంపేట ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చిన్నగొట్టిముక్ల పంచాయతీలోని చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.

### కొల్చారంలో..

కొల్చారం, ఏప్రిల్ 5: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆరోగ్యంగా ఉంటూ ప్రజాసేవలో కొనసాగాలని బీఆర్ఎస్ నాయకులు ప్రార్థించారు. పలువురు నాయకులు ఏడుపాయల వన దుర్గాభవానీ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

### కౌడిపల్లిలో..

కౌడిపల్లి, ఏప్రిల్ 5: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టిన రోజు వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

### వెల్దుర్తిలో..

వెల్దుర్తి, ఏప్రిల్ 5: ఎమ్మెల్యే సునీతారెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు.

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, ఏప్రిల్ 5: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని మండల కేంద్రంలో నాయకులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు. వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం, లేబర్ వెల్ఫేర్‌బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



చిలిపిచెడ్: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కొల్చారం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శివ్వంపేట: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### బోరుమోటరుకు మరమ్మతులు చేయించండి



మరమ్మతులకు నోచుకోని మోటర్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 5: మండలంలోని అంబాజీపేట బీసీ కాలనీలో బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. బోరుమోటర్ కాలిపోయి పది రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని బోరుమోటర్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

### బోరుమోటర్ కేబుల్ చోరీ

చిలిపిచెడ్, ఏప్రిల్ 5: మండలంలోని గౌతాపూర్‌లో వారం రోజుల కింద బోరుమోటర్ల కేబుల్‌ను దుండగులు దొంగలించారు. ఈ విషయంలో రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై నర్సింహులు శనివారం పరిశీలించారు. గ్రామం లో ఐదుగురు రైతుల దగ్గర బోరుమోటర్ల కేబుల్ దొంగలించిన వ్యక్తిని కొల్చారం మండల ఎనగండ్ల గ్రామంలో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.



## నిందితురాలిని శిక్షించాలని కొవ్వొత్తుల ర్యాలీ

అమీన్‌పూర్ ఏప్రిల్ 5: ఈ నెల 28 న ముగ్గురు చిన్నారులను కన్న తల్లి చంపిన ఘటనకు నిరసనగా రాఘవేంద్ర కాలనీవాసులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో రాఘవేంద్ర నగర్ కాలనీ, మారుతీ నగర్ కాలనీ, కృష్ణ నగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.



### పేదోళ్ల కడుపు నింపేందుకే సన్నబియ్యం

మెదక్‌రూరల్, ఏప్రిల్ 5: పేదోళ్ల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నదని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మండలంలోని పాతూరు గ్రామంలో రేషన్ షాపులో రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు కలెక్టర్ సన్నబియ్యం పంపిణీచేశారు. జిల్లాలోని 520 రేషన్ షాపుల ద్వారా 2,13828 రేషన్ కార్డుదారులకు 4430,496 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆరు లక్షల 96 వేల 43మంది సభ్యులకు లబ్ధి చేకురనున్నదన్నారు. డీలర్ భిక్షపతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


## దౌలాపూర్‌లో చిరుత సంచారం

- భయబ్రాంతులకు గురవుతున్న గ్రామస్తులు
- వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలి
- ఘటనా స్థలానికి చేరుకున్న ఆటవీశాఖ అధికారులు

పాపన్నపేట, ఏప్రిల్ 5: పాపన్నపేట మండలంలోని దౌలాపూర్‌లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులో పులి కాపు కాసుకుని ఉన్నదని గ్రామస్తులు భయబ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు రాత్రి 9గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకున్నారు. పాద ముద్రలు చూస్తే చిరుత అయి ఉంటుందని ఒక అధికారి వెల్లడించారు. రాత్రి కావడంతో గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు. అడవి జంతువుల నుంచి తమకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరోవైపు రాత్రంతా ఎలా గడపాలో పాలుపోక అయోమయంలో ఉన్న గ్రామస్తులు బిక్కుబిక్కు మంటూ గడిపే పరిస్థితి నెలకొన్నది. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పులి కోసం గ్రామ శివారులో కాపలాగా ఉన్న దౌలాపూర్ గ్రామస్తులు



పులి కాలి ముద్రలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

**I, GUNNALA JEEVITHA** W/o. SAI REDDY GARI ACHYUTH RAM REDDY R/o. H.No. 2-71, Thopugonda Village, Kandhi Mandal, Sangareddy Dist., TG. Geevitha Sai Reddy Gari (Old Name) and have changed my name **GUNNALA JEEVITHA,** W/o. Sai Reddy Gari Achyuth Ram Reddy (New Name) as per all further purpose

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657